# అధికారులు బాధ్యతగా పని చేయాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

◆ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, జనవరి 23 : ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు బాధ్యతగా పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బుర్ర రేఖ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో మండలంలోని 27 గ్రామాలకు గానూ 24 గ్రామాలకు నిర్మల్ పురస్కార్ అవార్డులు వచ్చాయని, అలాంటి గ్రామాలు అధ్వానంగా ఎందుకు మారాయని అధికారులను ప్రశ్నించారు. ప్రజల కోసం పనిచేయడం ఇష్టం లేని అధికారులు వేరే చోటకు వెళ్లవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. మైనింగ్ జోన్‌లో ఉన్న చెరువు, కుంటలను కబ్జా చేసిన వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నోటీసులు ఇచ్చి చట్ట పరంగా ఎఫ్‌టీఎల్‌లో ఉన్న వాటన్నింటినీ సీజ్ చేయాలని తెలిపారు. మీ సేవా కేంద్రాల పై రివ్యూ చేసి అధిక చార్జీలు వసూలు చేస్తే కఠన చర్యలు తీసుకోవాలన్నారు. మండలానికి 6 మీ సేవా కేంద్రాలు సరిపోవని, జనాభా ప్రాతిపదికన సంఖ్యను పెంచాలన్నారు. అనంతరం మండల పరిషత్ అధ్యక్షురాలు బుర్ర రేఖామహేందర్‌గౌడ్ పాలకవర్గంతో కలిసి సర్పంచ్‌లను సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బింగి దాస్‌గౌడ్, వైస్ ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీవో మమతాబాయి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌస్‌పాషా, సర్పంచ్‌లు కొర్ర లావణ్య, ముద్దం స్వరూప, జక్క లావణ్య, సురకంటి వనజ, పారంత సంతోష, యశోద, సుజాత, శ్రీనివాస్‌రెడ్డి, వీరస్వామిగౌడ్, వెంకటేశ్, రంగయ్య, కిరణ్‌కుమార్‌గౌడ్, సుధాకర్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మల్లేశ్, ఎంపీటీసీలు లావణ్య, భాస్కర్‌గౌడ్, బాలలింగస్వామి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ తక్కువగా ఉంటే ఫిర్యాదు చేయండి



ఇబ్రహీంపట్నంలో వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

ఇబ్రహీంపట్నంరూరల్, జనవరి 23 : గ్యాస్ సిలిండర్ల తూకం తక్కువగా ఉంటే ఫిర్యాదు చేసే హక్కు విని యోగదారులకు ఉందని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ అన్నారు. మంగళవారం ఇబ్రహీం పట్నంలో గ్యాస్ సిలిండర్ల రవాణాను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్యాస్ సిలిండర్లను డోర్ డెలివరీ చేయకుండా రోడ్డుపైనే పెట్టి పోతున్నారన్న ఫిర్యాదులతో పాటు అధికంగా వసూళ్లు చేస్తున్నారని అని కొందరు ఫిర్యాదు చేశారని తెలిపారు. గ్యాస్ బండల పరిమాణంపై అనుమానం ఉంటే ఎంత బరువు ఉందో తూకం వేసి పరీక్షించుకోవాలన్నారు.

**ఆమనగల్లు :** గ్యాస్ సిలిండర్ల తూకం తక్కువగా ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. మాడ్గుల మండలంలో గ్యాస్ డోర్ డెలివరీని తనిఖీ చేశారు.

## ఆధార్ సెంటర్ కోసం వినతి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్

కడ్తాల్, జనవరి 23 : కడ్తాల్ మండల కేంద్రంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) ప్రతిమాసింగ్‌ను ఆయన కలిసి వినతి పత్రం అందజేశాడు. 2016లో 24 గ్రామ పంచాయతీలతో కడ్తాల్ గ్రామం మండలంగా ఏర్పడిందని, అప్పటి నుంచి మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఆధార్ కోసం హైదరాబాద్, వెల్దండ, మహేశ్వరం ప్రాంతాల కు వెళ్లాల్సి వస్తున్నదని పేర్కొన్నారు.

## నేతాజీ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం


షాద్‌నగర్ పట్టణంలో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌టౌన్, జనవరి 23: నేటి తరం యువతకు స్ఫూర్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ ధైర్య సాహసాలు, దేశభక్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, నాయకులు బస్వం, వెంకటేశ్‌గౌడ్, నందు పాల్గొన్నారు.

**కడ్తాల్ :** యువత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను ఆదర్శంగా తీసుకోని ముందుకెళ్లాలని యువజన సంఘాల ఐక్య వేదిక అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో వివేకానంద, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామచంద్రయ్య, లక్ష్మయ్య, వెంకటేశ్, లక్ష్మీనారాయణ, మహేశ్, మురళి, కృష్ణ, చందు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టణంలోని చంద్రబోస్ విగ్రహానికి పలువురు నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పోరాట పటిమ నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వన్నాడ ప్రకాశ్‌గౌడ్, నాయకులు చెన్నయ్య, అగ్గనూరు నంద్, గాజుల శేఖర్, పట్టిల నరేందర్, భాస్కర్, శ్రీధర్, ప్రవీణ్, వినోద్ పాల్గొన్నారు.


మొయినాబాద్ : పెద్దమంగళారంలో నివాళులర్పిస్తున్న నాయకులు

**మొయినాబాద్ :** మండల పరిధిలోని పెద్దమంగళారం గ్రామంలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరోత్తంరెడ్డి, మాజీ సైనికులు ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రంగారెడ్డి, కృష్ణ, రాజు, పాండు, శ్రీశైలం, గ్రామ పెద్దలు మల్లారెడ్డి, రాజీరెడ్డి, నారాయణరెడ్డి, రాము, నాగరాజు తదిరతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సులు


నక్కలపల్లి గ్రామంలో డ్రోన్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

మొయినాబాద్, జనవరి 23 : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై అధికారులు అవగాహన కల్పించారు. మంగళవారం మండల పరిధిలోని నక్కలపల్లి, కుతుబుద్దీన్‌గూడ గ్రామాల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, మొయినాబాద్, మేడిపల్లి గ్రామాల్లో యూనియన్ బ్యాంక్, హిమాయత్‌నగర్ గ్రామంలో కెనరా బ్యాంక్ అధికారులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. జన్‌దన్ యోజన బ్యాంక్ ఖాతాలు, ఆయుష్మాన్ భారత్, బీమా సౌకర్యాలు, జీవిత బీమా సౌకర్యాలు, కిసాన్ సమ్మాన్ నిధి, పీఎం కృషి సంచాయ్ యోజన వంటి పథకాలపై ఆయా గ్రామాల్లో ఆయా బ్యాంక్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. వ్యవసాయ రంగంలో ఆధునిక యంత్రాలను ఉపయోగిస్తున్న నేపథ్యంలో డ్రోన్‌ను వ్యవసాయంలో ఎలా ఉపయోగించుకోవచ్చనే అంశంపై డ్రోన్ ప్రదర్శన నక్కలపల్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఎస్‌బీఐ మేనేజర్ నిఖిల్‌కుమార్, హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల, నాయకులు కంజర్ల ప్రకాష్, బి జంగారెడ్డి, నీలకంఠం, వివిధ బ్యాంకు మేనేజర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## నల్లచట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్ రెడ్డి

ఆమనగల్లు, జనవరి 23: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నల్లచట్టాలను రద్దు చేయాలని తెలంగాణ రైతు సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో రైతు సంఘం జిల్లా నాయకుడు కానుగుల వెంకటయ్యతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడా రు. ప్రధాని మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నల్లచట్టాలను రద్దు చేయకుండా దొడ్డిదారిలో వాటిని అమలు చేసేందుకు యత్నిస్తున్నదని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం రైతు, కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో ఈ నెల 25న జరుగనున్న ట్రాక్టర్ ర్యాలీకి వామపక్ష, ప్రజాతంత్రవాదులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, జిల్లా నాయకులు పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

చేవెళ్లటౌన్, జనవరి 23: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలు, తినుభండారాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కాంచన లత, ఈడీపీ కాల్ కన్వీనర్ వైష్ణవి, అధ్యాపకులు అనురాధ, రూప్నా, రవీంద్రన్, జ్యోతి, షేక్ మహబూబ్, రవీందర్, రాగిణి, స్వర్ణలత, సతీష్, వెంకటలక్ష్మి, శకుంతల, వీరేశం పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుకన్య

యాచారం, జనవరి 23 : గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ కొప్పు సుకన్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ పంచాయతీ అభివృద్ధి 2024-2025 సంవత్సరం ప్రణాళిక (బీపీడీపీ)పై మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలోనూ జరుగాల్సిన అభివృద్ధిపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతపై ప్రధాన దృష్టి సారించాలన్నారు. పంచాయతీ రికార్డులను పక్కాగా అమలు చేయాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి తదితరులున్నారు.

## ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

మొయినాబాద్, జనవరి 23 : ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసి.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు గునుగుర్తి నక్షత్రం అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎస్‌టీఎఫ్ జిల్లా, రాష్ట్ర కమిటీలకు సంబంధించిన క్యాలెండర్‌ను తహసీల్దార్ గౌతమ్ కుమార్, ఎంపీడీవో సంధ్య, ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్యతో కలిసి ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, సీనియర్ ఉపాధ్యాయులు రాంచందర్, రమేశ్, శోభ, బాల్‌రాజ్, సుజాత, స్వప్న, శ్రీవాణి, సంతోషి, వెంకటస్వామి, రవికాంత్‌రెడ్డి, రాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.


మండల పరిషత్ కార్యాలయం వద్ద క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గునుగుర్తి నక్షత్రం

## గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



షాబాద్ పీఆర్‌ఆర్ స్టేడియంలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ జడ్పీటీసీ రాజేందర్‌గౌడ్, సీఈవో జార్జ్ థామస్, కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్

షాబాద్, జనవరి 23: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తామని మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్ అన్నారు. రెండు రోజులుగా షాబాద్ పీఆర్‌ఆర్ స్టేడియంలో మాంటిస్సోరి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడాపోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో జార్జ్ థామస్, కరస్పాండెంట్ మహేశ్‌యాదవ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, ఇన్‌చార్జి గిరిప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు రమేశ్‌యాదవ్, మల్లేశ్‌యాదవ్, నర్సింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తాం


ఉపాధ్యాయులు, విద్యార్థులతో లయన్స్ క్లబ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

కడ్తాల్, జనవరి 23 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తామని లయన్స్ క్లబ్ ఆఫ్ ఎన్‌ఫీల్డ్ లండన్-డాక్టర్ సుగుణారామ్మోహన్‌రావు ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ప్రతినిధులు డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ మాధవి అన్నారు. తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సంస్థ తరపున ఇదివరకు చేపట్టిన కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయాలను మంగళవారం వారు పరిశీలించి, ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన టాయిలెట్స్‌ను ప్రారంభించారు. పాఠశాలకు సంస్థ అందించిన ల్యాబ్స్.. తమ విద్యాభివృద్ధికి ఎలా ఉపయోగపడుతున్నాయో తదితర విషయాలను ప్రతినిధులకు విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే ఏదైనా సాధించవచ్చని, తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విద్యార్థులు శ్రద్ధగా వినాలని తెలిపారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్ అనిల్, ఎస్‌ఎంసీ చైర్మన్ సంజూపాషా, మెంబర్ మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం ఝాన్సీ, ఉపాధ్యాయులు భగవాన్‌రెడ్డి, జార్మియా, విష్ణుమూర్తి, రఘుమారెడ్డి, శ్రీనివాస్, రవి, ఉమాదేవి, విజయశ్రీ, మాధవి, సరళ, పద్మ, శ్రీలత, విశ్రాంత ఉపాధ్యాయుడు సురేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన నాయకులు

షాబాద్, జనవరి 23: చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డిని మండలంలోని నరెడ్లగూడ గ్రామస్తులు కలిశారు. మంగళవారం నగరంలోని ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తమ గ్రామ బీటీ రోడ్డు విషయమై చర్చించారు. బీఆర్‌ఎస్ పాలనలో నరెడ్లగూడ గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైందని, త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ఆంజనేయులు, ముక్కు విశ్వం, బర్క కృష్ణాయాదవ్, కుమ్మరి దర్శన్, పెండ్యాల చందు, రాములు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు



శంకర్‌పల్లి, జనవరి 23 : మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ సైదులు అన్నారు. మంగళవారం మండలంలోని కొండకల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహనాలు సీజ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్లు ధరించాలన్నారు.

## మున్సిపాలిటీల్లో ప్రగతి పరుగులు పెట్టాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

◆ సమీక్షలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జనవరి 23 : షాద్‌నగర్, కొత్తూరు మున్సిపాలిటీల్లో ప్రగతి పరుగులు పెట్టాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తూరు, షాద్‌నగర్ మున్సిపాలిటీల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీల్లో అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల వివరాలు, మధ్యంతరంగా నిలిచిపోయిన పనుల వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులపై ముందుగా దృష్టిసారించాలని, మున్సిపాలిటీల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసి పూర్తి వివరాలతో ఇవ్వాలని సూచించారు. అభివృద్ధి పనులకు అవసరమయ్యే నిధులను సమకూర్చేందుకు ప్రభుత్వ పరమైన చర్యలను తీసుకుంటామని చెప్పారు. అన్ని విభాగాల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా అధికారులు వ్యవహరించరాదని చెప్పారు. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో షాద్‌నగర్ కమిషనర్ వెంకన్న, కొత్తూరు కమిషనర్ వీరేందర్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**సమస్యలను పరిష్కరించండి**

షాద్‌నగర్ మున్సిపాలిటీ పట్టణ మహిళా సమాఖ్యలో విధులు నిర్వహిస్తున్న తయ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఈ మేరకు ఆర్పీలు వినతిపత్రం అందజేశారు. గౌరవ వేతనం పెంచడంతో డ్రెస్ కోడ్‌కు నిధులు మంజూరు చేయాలన్నారు.

## యువత మత్తుకు చిత్తు కావద్దు

కొత్తూరు, జనవరి 23: మత్తు పదార్థాలకు యువత చిత్తు కావద్దని కొత్తూరు సీఐ నరసింహారావు అన్నారు. కొత్తూరు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పాన్ డబ్బాలు, అనుమానిత దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నిషేధ మత్తు పదార్థాలు అమ్మినా, సేవించినా చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా యువత మత్తు పదార్థాలు సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అన్నారు. అలాంటివి ఏమైనా ప్రజల దృష్టికి వస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తనిఖీల్లో ఎస్‌ఐలు శ్రీనివాస్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నందిగామ, జనవరి 23 : నందిగామ మండలం చేగూరు ప్రభుత్వ పాఠశాలలో 2003-2004 పదో తరగతికి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యాచారం, జనవరి 23: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం మండలంలోని కొత్తపల్లిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంటల వరకు గృహ అవసరాలకు, ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

**మంచాల మండలంలో..**

మంచాల : మంచాల మండలం బోడకొండ, లోయపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని చీదేడు, దాద్‌పల్లి, ఎల్లమ్మతండా, సత్యంతండా, కొర్రవాని తండా, ఆంబోత్‌తండా, చలిగుట్ట తండా గ్రామాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సత్యానారాయణ మంగళవారం తెలిపారు. చెట్ల కొమ్మల తొలగింపు, సబ్‌స్టేషన్‌లో చిన్నచిన్న మరమ్మతులు చేయనున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు తమకు సహకరించాలని కోరారు.

**మొయినాబాద్ :** విద్యుత్తు తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్న నేపథ్యంలో నక్కలపల్లి ఫీడర్ పరిధిలోని నక్కలపల్లి, ఎతుబార్‌పల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ఏఈ హమూనాయక్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా పెద్దమంగళారం ఫీడర్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, చిన్నషాపూర్, అప్పారెడ్డిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు ఉండదన్నారు. కావున ప్రజలు గమనించి సహకరించాలని సూచించారు.